సాక్షి పెద్దపల్లి

సోమవారం । 28 । ఆగస్టు । 2023



లద్నాపూర్‌లో ఉద్రిక్తత

లద్నాపూర్‌లో ఉద్రిక్తత నెలకొంది. సింగరేణి అధికారులు సమాచారం ఇవ్వకుండా పోచమ్మ విగ్రహాన్ని తొలగించడాన్ని నిరసిస్తూ స్థానికులు ఆందోళనకు దిగారు. 8లో▸



'ప్రభావిత' ప్రజల సంక్షేమమే ధ్యేయం

సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ అన్నారు. 8లో▸



వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లావ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పేదల ఆరోగ్యరక్షణకు ప్రాధాన్యం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న చీఫ్‌విప్

పెద్దపల్లిరూరల్: నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని శాసనమండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు అన్నారు. జిల్లాకేంద్రంలో ఆదివారం 27మంది లబ్ధిదారులకు రూ.10.19 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించామని, ప్రైవేటులో వైద్యం పొందినవారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందుతోందని పేర్కొన్నారు. నాయకులు మందల సత్యనారాయణరెడ్డి, పెగడ రమేశ్, పాగాల శ్రీకాంత్, పడాల సతీశ్, కొక్కిరాల మహేశ్వర్‌రావు, చక్రధర్‌రావు, సుధాకర్‌రావు, ఖలీల్, రాయనర్సు, మారం కొమురయ్య, తిరుపతి, మధుసూదన్‌రావు, తిరుపతి, చంద్రయ్య తదితరులున్నారు.

ఎల్లమ్మ చెరువుకు చేరిన బోటు



పెద్దపల్లి ఎల్లమ్మ చెరువుకు చేరిన బోటు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని ఎల్లమ్మ, గుండమ్మచెరువులో ఇకనుంచి బోటు షికారు అందుబాటులోకి రానుంది. రాష్ట్ర టూరిజం శాఖ నుంచి తెప్పించిన బోటును చెరువులోకి చేర్చారు. మున్సిపల్ నుంచి రూ.14లక్షలు వెచ్చించి బోటును తెప్పించినట్లు అధికారులు తెలిపారు.

కేసీఆర్ గెలిస్తే రాష్ట్రం ఆగమే..



మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

సుల్తానాబాద్: రాష్ట్రంలో మరోసారి కేసీఆర్ గెలిస్తే రాష్ట్రం ఆగమవుతుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనపై ప్రజలు విసుగుచెందారని, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఒక్కటేనని తెలిపారు. కుటుంబ పాలనకు చరమగీతం పాడాలన్నారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. అసెంబ్లీ కన్వీనర్ పెన్నింటి రాజు, మండల అధ్యక్షుడు కడారి అశోక్‌రావు, పట్టణ అధ్యక్షుడు ఎల్లంకి రాజు, మహేందర్ యాదవ్, తిరుపతియాదవ్, రాజేంద్రప్రసాద్, బుర్ర సతీశ్‌గౌడ్, గుడ్ల వెంకటేశ్ ఉన్నారు.

కాంగ్రెస్ గెలుపుకోసం కృషి చేయాలి

డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు

రామగుండం: కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలోనే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని, రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు పని చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. ఆదివారం సండే మార్కెట్ ఏరియాకు చెందిన సామాజిక కార్యకర్త ఓడెల రాజమౌళి కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, సిరిశెట్టి సతీష్‌గౌడ్, మొహిన్, రషీద్, యూసుఫ్‌ఖాన్, చాంద్‌పాషా, అల్లి శంకర్, అష్రఫ్‌ఖాన్, గుర్రం అంజయ్య, మోజెస్, నాగరాజు తదితరులున్నారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల పూజలు

ఓదెల: మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలుప్రాంతాల నుంచి వచ్చారు. ఒగ్గు పూజారులతో స్వామివారికి పట్నాలు వేశారు. బోనాలు చేసి నైవేద్యంగా సమర్పించారు.

'లెక్కల్లో' నేతలు..!

- కులాల వారీగా ఓటర్ల వివరాలు సేకరణ
- బలమైన నాయకులు పార్టీలో చేరేలా ప్లాన్
- వారితో సమావేశమయ్యేందుకు ప్రయత్నాలు
- డిమాండ్లను ముందుంచుతున్న కుల సంఘాలు



మన నియోజకవర్గంలో మన సామాజిక వర్గానికి మెజార్టీ ఓట్లు ఉన్నాయి. అసెంబ్లీలో మన సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు తక్కువ ఉన్నారు. ఈ సారి పార్టీలు పక్కనపెట్టి మన అభ్యర్థిని నిలబెట్టుకుని గెలిపించుకుందాం..' ఇది ఓ సామాజికవర్గం ఇటీవల నిర్వహించిన సమావేశంలో చేసుకున్న తీర్మానం.

ఇక్కడ మా సామాజికవర్గం ఓట్లు 30వేలు ఉన్నాయి. మా సామాజిక వర్గానికి చెందిన భవన నిర్మాణం పూర్తి చేయించండి. మీరేం చేస్తారో చెబితే సమావేశం ఏర్పాటు చేసుకుని నిర్ణయం తీసుకుంటాం. అందరినీ సంప్రదించి మీకు మద్దతిస్తాం..' ఇది ఓ ప్రాంతానికి చెందిన నేతలు బరిలో ఉంటున్న అభ్యర్థులతో బేరసారాల తీరు.

సాక్షి, పెద్దపల్లి: త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే అన్నివిధాలా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. మరోపక్క రాజకీయ పార్టీలు కూడా ఎన్నికల శంఖారావాన్ని పూరించాయి. ఇందులోభాగంగా బీఆర్‌ఎస్ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున పోటీచేసే అభ్యర్థులను అన్నిపార్టీల కంటే ముందుగానే ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఈ రెండు పార్టీలకు ఏమాత్రమూ తగ్గకుండా బీజేపీ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఇతర రాష్ట్రాలకు చెందిన ఒక్కో ఎమ్మెల్యేతో సమావేశాలు ఏర్పాటు చేయిస్తోంది. మొత్తంగా ప్రధాన పార్టీలన్నీ నాలుగు నెలల ముందే ఎన్నికల వేడిని పెంచుతున్నాయి. అయితే ఇప్పుడు అన్ని పార్టీల్లో పోటీచేసే అభ్యర్థులు తమ నియోజకవర్గాల వారీగా ఇటీవల విడుదలైన ఓటరు ముసాయిదా జాబితా ఆధారంగా తమ నియోజకవర్గంలో ఏయే సామాజికవర్గాల వారు ఎందరున్నారు..? ఆయా సామాజిక వర్గాల్లో పెద్దలు ఎవరు..? వారు ప్రస్తుతం ఏ పార్టీకి అనుబంధంగా పనిచేస్తున్నారు..? తమ వైపు ఆ సామాజికవర్గం ఓటర్లను తిప్పుకోవాలంటే ఏం చేయాలి..? తదితర అంశాల ప్రాతిపదికన కసరత్తు మొదలు పెట్టారు.

ఆయా నేతలపై ఫోకస్

అన్ని పార్టీలు వివిధ సామాజిక వర్గాల్లోని ప్రముఖమైన నాయకులను గుర్తించే పనిలో ఉన్నారు. గతంలో సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, సహకార, మార్కెట్‌కమిటీ తదితర ప్రజాప్రాతినిధ్య పదవులకు పోటీచేసి ఓడిన, గెలిచిన మాజీలను తమ వైపు తిప్పుకునేందుకు యత్నిస్తున్నారు. దీంతో నియోజకవర్గాల్లో నేతలు తమ కార్యక్రమాల్లో నేతల చేరికలకు సంబంధించిన కార్యక్రమం ఉండేలా చూసుకుంటున్నారు. ఇదే అదునుగా ఆయా నేతలు తమ సామాజికవర్గానికి ఏం చేస్తారు..? ఆర్థికంగా ఎలా సహాయపడుతారు..? ప్రభుత్వం అందించే దళిత, బీసీ, మైనార్టీ, గృహలక్ష్మి తదితర పథకాల్లో లబ్ధిదారులుగా తమ అనుచరులను చేర్పిస్తే పార్టీలోకి వస్తామంటూ డిమాండ్లు ముందుంచుతున్నారు. మరికొందరు పార్టీల్లో ఇమడలేక, ఆత్మగౌరవం పేరుతో బయటకు వెళ్లిపోతున్నారు.

బలం చూపించుకునేలా..

నియోజకవర్గాల్లో తమ మద్దతులేకుండా విజయం సాధించలేరని, వీలైతే తమ వర్గానికి చెందిన వారికి టికెట్ కేటాయించాలని కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. అలాకాని పక్షంలో తమ సామాజికవర్గాల నేతలకు భవిష్యత్‌లో వచ్చే స్థానిక సంస్థలు ఎన్నికల్లో పదవులపై క్లారిటీ ఇవ్వాలంటూ సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. మరికొందరు కుల భవనాలు, ఆలయాల నిర్మాణాలు కోసం ఆర్థిక సాయం చేయమంటున్నారు. ఎన్నికలు దగ్గరపడేకొద్దీ ఇలాంటి సమావేశాలు మరిన్ని జోరందుకోనున్నాయి.





ఆదివరాహస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

కమాన్‌పూర్ మండలకేంద్రంలోని శ్రీఆదివరాహస్వామి దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. మంగళవారం స్వామివారి జయంతి సందర్భంగా మూడురోజులు ఉత్సవాలు నిర్వహించనున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో సింగరేణి ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్, తహసీల్దార్ రాంమ్మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. – కమాన్‌పూర్

మంథనిపై సీఎం మమకారం

- పెండింగ్ పనుల పూర్తికి సానుకూలత
- జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌తో వరుస భేటీ
- కాటారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు నోటిఫికేషన్
- ప్రధాన రహదారుల మరమ్మతుకు సత్వర ఆదేశాలు
- పోతారం, చిన్నకాళేశ్వరం ఎత్తిపోతలపై చిగురిస్తున్న ఆశలు
- కాసిపేట, బోర్లగూడెం మండలాలకూ మోక్షం

దశాబ్దాల తరబడి అభివృద్ధిలో వెనుకబడిన.. మారుమూలప్రాంతమైన మంథని నియోజకవర్గంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. నియోజకవర్గంలో పెండింగ్ పనుల పూర్తి చేయాలని సంకల్పించారు. ఈనెల 21న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటన అనంతరం మంథని అభ్యర్థి, జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధును స్వయంగా రాష్ట్ర రాజధానికి పిలిపించుకున్నారు. వరుసగా మూడురోజులు మధుతో పలు అంశాలపై చర్చించారు. జెడ్పీ చైర్మన్ మధు అభ్యర్థన మేరకు సీఎం పలు నిర్ణయాలు తీసుకున్నారు.



ఎత్తిపోతల పూర్తయితే సాగులోకి రానున్న భూములు



జెడ్పీ చైర్మన్ పుట్ట మధుతో చర్చిస్తున్న సీఎం

మంథని: రాష్ట్రంలో భౌగోళికంగా అతిపెద్ద నియోజకవర్గం మంథని. సుమారు 180కిలో మీటర్ల పొడవు.. సుమారు 40 కిలోమీటర్ల వెడల్పుతో విస్తరించి ఉంది. మంథని కేంద్రంగా రెవెన్యూ డివిజన్ కొనసాగుతోంది. అయితే మూడురోజుల క్రితం ఇదే నియోజకవర్గంలో ఉన్న (ప్రస్తుతం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా) కాటారం కేంద్రంగా మరో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సీఎం కేసీఆర్ నోటిఫికేషన్ జారీ చేశారు. అంతేగాకుండా మరో నాలుగు రోజుల్లో మంథని మండలం గుంజపడుగు (కాసిపేట), మహాముత్తారం మండలంలోని బోర్లగూడం గ్రామాలను మండల కేంద్రాలుగా ప్రకటించేందుకూ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

పోతారం ఎత్తిపోతలపై ఆశలు.. చిన్న కాళేశ్వరానికి నిధులు

రాష్ట్రానికే తలమానికంగా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగిన మంథని నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో రూ.500 కోట్లతో చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం అసంపూర్తి పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించారు. పథకం కొనసాగింపునకు తక్షణ సాయం కింద రూ.100కోట్లు కేటాయించాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు సీఎంకు వినతి పత్రం సమర్పించగా.. మంజూరు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. అలాగే ఎస్సారెస్పీ డి-83 కాలువపై ఒత్తిడి తగ్గించడంతోపాటు ఆయకట్టు పరిధిలో ఉన్న 20వేల ఎకరాలు, టేలాండ్‌లో ఉన్న చివరి భూములు, కొత్తగా మరో 10వేల ఎకరాలను సాగులోకి తెచ్చేందుకు ప్రతిపాదించిన మంథని మండలం పోతారం ఎత్తిపోతలపైనా నిర్ణయం తీసుకోనున్నారు. ఈ ఎత్తిపోతలపై నాలుగేళ్లుగా తాత్సారం జరుగుతుండడంతో రైతుల్లో అసహనం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో పథకం నిర్మాణానికి రూ.200కోట్లు కేటాయించేందుకు ముఖ్యమంత్రి సంబంధిత అధికారులతో కసరత్తు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలోనే ఈ పథకానికి మోక్షం లభిస్తుందని అన్నదాతలు భావిస్తున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే మంథని నియోజకవర్గం అభివృద్ధిలో మరో మెట్టుకు చేరుతుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఎన్నికల వేళ కలిసొస్తున్న అభివృద్ధి

దశాబ్దాల తరబడి రాష్ట్రం, దేశానికి రాజకీయ ఉద్దండులను అందించిన మంథని నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని కోట్లయినా ఇచ్చేందుకు సిద్ధమని మంథని నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధుకు సీఎం భరోసా ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. రానున్న ఎన్నికల్లో మెజార్టీ వర్గాలను ఆకట్టుకునేలా ముఖ్యమంత్రి కేసీఆర్ మధును వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల నిర్మాణానికీ సైతం సీఎం అత్యంత ప్రాధాన్యత ఇచ్చి కోట్లాది నిధుల విడుదలకు సంబంధిత అధికారులను ఆదేశించారు. సవాళ్లు, ప్రతిసవాళ్ల మధ్య బీఆర్‌ఎస్ టికెట్ దక్కించుకున్న పుట్ట మధు నియోజకవర్గంలో ఐదేళ్లుగా నిలిచిపోయిన అభివృద్ధిని ఏకరువు పెట్టడం.. దానికి సీఎం ప్రత్యేక చొరవ తీసుకోవడం.. కోట్లాది రూపాయలు మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం ద్వారా మంథనికి త్వరలోనే మహర్దశ పట్టనుందని స్థానికంగా చర్చ నడుస్తోంది.

సింగరేణి మనుగడకు బీఆర్‌ఎస్ జెండా ఎగరాల్సిందే..

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



మాట్లాడుతున్న బాల్క సుమన్

గోదావరిఖని: సింగరేణి మనుగడకు బీఆర్‌ఎస్ జెండా ఎగరాల్సిందేనని ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎంపీ వెంకటేశ్ నేత, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ కోసం పదవులను తృణప్రాయంగా వదిలేసిన నాయకుడు కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పేమాటలను ప్రజలు వినే పరిస్థితుల్లో లేరన్నారు. గత ప్రభుత్వాలు సింగరేణి కార్మికులను రాచి రంపాన పెట్టి వారసత్వ ఉద్యోగాలు పోగొట్టాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ కార్మికులపై ఉన్న ప్రత్యేక ప్రేమతో కారుణ్యనియామకాలు, వారసత్వ ఉద్యోగాలు ఇప్పించారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ సింగరేణి సంస్థను ప్రైవేట్‌పరం చేయాలని కుట్ర చేస్తోందన్నారు. గుజరాత్‌లో ఇచ్చిన విధంగా సింగరేణికి గనులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా కేంద్రం పట్టించుకోలేదన్నారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, జెడ్పీటీసీ ఆముల నారాయణ, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, నాయకులు తోడేటి శంకర్‌గౌడ్, నారాయణదాసు మారుతి, మాదాసు రాంమూర్తి, పర్లపల్లి రవి, జేవీరాజు, జాహిద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనతోనే పేదలకు మేలు



చీకురాయిలో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ హయాంలోనే అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందాయని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అధికారం అప్పగించాలని ప్రజలు నిర్ణయం తీసుకున్నారని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం చీకురాయిలో ఆదివారం రాత్రి గడపగడపకూ విజ్జన్న కార్యక్రమాన్ని చేపట్టారు. వచ్చే ఎన్నికలే బీఆర్‌ఎస్‌కు ఆఖరువని అన్నారు. నాయకులు శ్రీనివాస్, సంతోష్, సుధాకర్‌రెడ్డి, మస్రత్, సిరవేన స్వప్న, తిరుపతి, పెంచాల మల్లయ్య, అజయ్, తిరుపతిరావు, శ్రావణ్, రాజు తదితరులున్నారు.

సంక్షేమ పథకాలతో బీఆర్‌ఎస్ మోసం

ఓదెల: సంక్షేమ పథకాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని విజయరమణారావు అన్నారు. మండలంలోని పొత్కపల్లిలో మాట్లాడారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



కాల్వశ్రీరాంపూర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వికలాంగులు

కాల్వశ్రీరాంపూర్: వికలాంగులకు పింఛన్ పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగులు క్షీరాభిషేకం చేశారు. మంథన రామస్వామి, రామ్మూర్తి, రాజేశం, కుమార్ పాల్గొన్నారు.

మంచంపట్టిన పల్లెలు

- మలేరియా బారిన ప్రజలు
- కిటకిటలాడుతున్న ఆసుపత్రులు
- గ్రామాల్లో లోపిస్తున్న పారిశుధ్యం
- తోడవుతున్న రెండో ఏఎన్‌ఎంల సమ్మె



ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు

సుల్తానాబాద్: జిల్లాను విష జ్వరాలు వెంటాడుతున్నాయి. డయేరియా, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. వీటికి సాధారణ, వైరల్ జ్వరాలు కూడా తోడవుతుండడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. తెల్ల రక్త కణాలు తగ్గుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో అత్యధిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏఎన్‌ఎంలు లేకపోవడం.. రెండో ఏఎన్‌ఎంలు నిరవధిక సమ్మెలో ఉండడం కూడా పల్లెల్లో వైద్య సేవలపై ప్రభావం చూపుతోంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 18 ప్రాథమిక, 8 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. జిల్లాకేంద్ర ఆస్పత్రితోపాటు గోదావరిఖనిలో ఏరియా ఆసుపత్రి, మంథని, సుల్తానాబాద్‌లో సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ ఆసుపత్రుల్లో కిందిస్థాయి సిబ్బంది తక్కువగా ఉన్నారు. దీంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులతోపాటు డెంగీ, మలేరియా విజృంభిస్తున్నాయి.

గాడి తప్పిన పారిశుధ్య నిర్వహణ

జిల్లాలో 266 గ్రామపంచాయతీలు ఉన్నాయి. మెజార్టీ గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పింది. ఖాళీస్థలాలు, గుంతలు, మురుగుకాలువల్లో పూడిక నిండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో చాలా గ్రామాల్లో ఇంటికి ఒకరిద్దరు జ్వరాలతో బాధపడుతున్నారు. కొన్ని గ్రామీణ ప్రాంత ఆరోగ్య కేంద్రాల్లో రోజుకు 70 నుంచి 180 మంది వచ్చే ఓపీ (ఔట్ పేషెంట్) ప్రస్తుతం 100 నుంచి 200వరకు పెరిగింది. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో డెంగీ పాజిటివ్ వచ్చిన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జ్వర పీడితుల రక్తనమూనాలు సేకరిస్తున్నారు. ఇప్పటివరకు వైద్య శిబిరాలు నిర్వహించిన గ్రామాల్లో 26,324 మందిని పరీక్షించగా.. 591 మంది జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు.

వ్యాధి	2022	2023
డెంగీ	315	81
మలేరియా	05	01

వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాం



గ్రామాల్లో విషజ్వరాలు, డెంగీ ప్రబలుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. స్థానిక వైద్య సిబ్బంది ద్వారా ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలకు అసౌకర్యం కలగకుండా కృషి చేస్తాం. ప్రజల సైతం చుట్టుపక్కల నీటి నిలువతో పాటు అపరిశుభ్రంగా ఉండకుండా చూసుకోవాలి.

– డాక్టర్ ప్రమోద్ కుమార్, డీఎంహెచ్‌వో

జ్వరాలు ప్రబలుతున్నాయి



పల్లెల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖలో ఏఎన్‌ఎంల కొరత తీవ్రంగా ఉంది. రెండో ఏఎన్‌ఎంలు రెగ్యులర్ చేయాలని పోరాటం చేస్తుండడంతో వైద్యసేవలు అందడం లేదు. వారి సమస్యలు పరిష్కరించడంతోపాటు గ్రామాలలో విష జ్వరంలో ప్రబలకుండా చూడాలి.

– కదారి సునీల్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

మహాధర్నా విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వెంకన్న

రామగిరి: ఈ నెల 29న హైదరాబాద్‌లో నిర్వహించనున్న కాంట్రాక్టు కార్మికుల మహాధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు ఆకుల వెంకన్న పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్జీ–3 డివిజన్‌లోని కాంట్రాక్టు కార్మికులతో సమావేశం నిర్వహించారు. హైపవర్ కమిటీ వేతనాలు తదితర హక్కుల అమలు కోసం ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

'సింగరేణి ఆర్థిక పరిస్థితిపై గందరగోళం'

గోదావరిఖని: సింగరేణి ఆర్థిక పరిస్థితిపై కార్మికుల్లో గందరగోళం నెలకొందని సీఐటీయూ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మెండె శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలో రాష్ట్ర ప్రభుత్వానికి 51 శాతం, కోలిండియాకు 49 శాతం వాటా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని కోలిండియాలో 23 నెలల ఏరియర్స్ ఈ నెల వేతనాలతో చెల్లించడానికి ఆదేశాలు ఇచ్చారని, సింగరేణి నుంచి అలాంటివేవీ రాకపోవడంతో కార్మిక సంఘాలు సంస్థ ఆర్థిక పరిస్థితిపై పలు సందేహాలు వెలిబుచ్చుతున్నాయని పేర్కొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువైందని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కొత్తగా ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థులు గనులపైకి వస్తే ఏరియర్స్ చెల్లింపులో జాప్యంపై ప్రశ్నించేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఏరియర్స్‌ను ఒకే దఫాలో చెల్లించాలని లేదంటే ఉన్నతాధికారులు సంస్థ ఆర్థిక పరిస్థితిని, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిల వివరాలను కార్మికులకు తెలియజేయాలని డిమాండ్ చేశారు.

బీసీ డిగ్రీ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

పెద్దపల్లిరూరల్: ఈ నెల 30వ తేదీలోగా బీసీ డిగ్రీ గురుకుల కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎ.స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వం మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలను పెద్దపల్లిలో ప్రారంభించిందని తెలిపారు. బీఏ(ఆర్థిక, రాజనీతి శాస్త్రం, చరిత్ర), బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ(గణితం, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ(బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ) కోర్సుల్లో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 99593 83509 ఫోన్ నంబర్‌లో లేదా గురుకుల డిగ్రీ కళాశాల చిరునామా : ఇంటి నంబర్ 6–20/ఊ1, ఊ2 శాస్త్రినగర్, సుల్తానాబాద్ నందు సంప్రదించాలని సూచించారు.

1 నుంచి సీపీఎం నిరసనలు

కరీంనగర్: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లాలో సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు సీపీఎం ఆధ్వర్యంలో నిరసనలు చేపడుతామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. ఒక వైపు పేదలపై ఆర్థిక భారం మోపుతూ మరోవైపు కార్పొరేట్లకు, పెట్టుబడుదారులకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇస్తోందని మండిపడ్డారు. 2014 ఎన్నికల సందర్భంగా ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని తెలిపారు. కానీ ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్నారని ఆరోపించారు. సెప్టెంబర్ 3, 4, 5 తేదీల్లో జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట, 7న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా ఉంటుందని పే ర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

లద్నాపూర్ గ్రామంలో ఉద్రిక్తత



పోచమ్మ విగ్రహాన్ని తొలగించిన ప్రదేశం



సైట్ ఆఫీస్ వద్ద పోలీసులతో గ్రామస్తుల వాగ్వాదం

- అర్ధరాత్రి పోచమ్మ విగ్రహం తొలగింపు
- అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం
- ఓసీపీ–2 గేట్ వద్ద ఆందోళన
- విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించాలని డిమాండ్

రామగిరి: మండలంలోని లద్నాపూర్ గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సింగరేణి అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా శనివారం అర్ధరాత్రి గ్రామ దేవత పోచమ్మ విగ్రహాన్ని తొలగించడాన్ని నిరసిస్తూ ఆదివారం ఉదయం ఆర్జీ–3 పరిధి ఓసీపీ–2 గేట్ వద్ద గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామానికి సంబంధించిన ఆర్‌అండ్‌ఆర్ ప్యా కేజీ సమస్యలను పరిష్కరించకుండా యాజమాన్యం కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ నిర్వాసితుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తోందని, తమ మనోభావాలను దెబ్బతీయడానికే ఇలా చేస్తోందని మండిపడ్డారు. అమ్మవారి విగ్రహన్ని ఆర్జీ–3 జీఎం దంపతులు తిరిగి ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. గేట్ వద్ద ఆందోళన అనంతరం సైట్ ఆఫీస్‌లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు. పోలీసులు అడ్డుకోగా వారితో వాగ్వాదానికి దిగారు. గ్రామంలోని 284 మందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వచ్చాకే పనులు చేపట్టాలని సింగరేణి అధికారులకు గతంలోనే చెప్పామన్నారు. అయినప్పటికీ గ్రామాన్ని బలవంతంగా ఖాళీ చేయించాలన్న ఉద్దేశంతోనే పోచమ్మ తల్లి విగ్రహాన్ని తొలగించారని ఆరోపించారు. మ్యాన్ వే రూంకు తాళం వేసి, కార్మికులను, క్వారీలో బ్లాస్టింగ్ పనులను అడ్డుకున్నారు. సింగరేణి యాజమాన్యం స్పందించి, యథాస్థానంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గోదావరిఖని వన్ టౌన్ సీఐ ప్రసాద్‌రావు, రామగిరి, ముత్తారం, మంథని ఎస్సైలు దివ్య, మధుసూదన్‌రావు, కిరణ్‌లు తమ సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆగ్రహం..

లద్నాపూర్‌లో పోచమ్మ తల్లి విగ్రహం తొలగించడం పట్ల ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. అమ్మవారి విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించాలని, మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు.

గల్లంతైన హెడ్‌కానిస్టేబుల్ మృతి

- తిమ్మాపూర్–ముంజంపల్లి శివారులో మృతదేహం లభ్యం



మృతదేహాన్ని తీసుకొస్తున్న కుటుంబసభ్యులు



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

తిమ్మాపూర్: కాకతీయ కాలువలో శుక్రవారం సాయంత్రం గల్లంతైన హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య (50) మృతిచెందారు. ఆదివారం సాయంత్రం ఆయన మృతదేహం లభ్యమైంది. తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం నుంచి కాలువలోని గేట్లలో ఒకటి మూసుకోకపోవడంతో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. సీఐ ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి, గేటు త్వరగా మూసివేయాలని కోరారు. వారు శ్రమించి, ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మూయించారు. దీంతో గాలింపు చర్యలు వేగవంతం చేశారు. సాయంత్రం 6 గంటలకు తిమ్మాపూర్–ముంజంపల్లి శివారులో మల్లయ్య మృతదేహం దొరికినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య హేమలత, కూతుళ్లు కీర్తన, శ్రీజ ఉన్నారు.

పర్యవేక్షించిన ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య కొన్నేళ్లుగా మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు వద్ద గన్ మెన్‌గా పని చేస్తున్నారు. ఆయన కాకతీయ కాలువలో గల్లంతయ్యారని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం కాలువ వద్దకు వచ్చారు. గాలింపు చర్యలను పర్యవేక్షించారు. మృతుని కుటుంబసభ్యులను ఓదార్చారు.

ఇంజక్షన్ వికటించి యువకుడు..

- రెండు రోజులు చికిత్స అందించినా దక్కని ప్రాణాలు
- ఆర్ఎంపీపై కేసు



సతీశ్‌కుమార్ (ఫైల్)

గోదావరిఖని: స్థానిక హనుమాన్‌నగర్‌కు చెందిన దాసరి సతీశ్‌కుమార్(35) ఇంజక్షన్ వికటించి, మృతి చెందాడు. గోదావరిఖని వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్న సతీశ్‌కుమార్ ఈ నెల 24న తీవ్ర జ్వరం, తలనొప్పితో బాధపడుతూ స్థానికంగా రాజా క్లినిక్ నడుపుతున్న ఆర్ఎంపీ రేవెల్లి నరేందర్ వద్దకు వెళ్లాడు. పరీక్షించిన ఆ వైద్యుడు అతనికి ఇంజక్షన్ వేసి, ఇంటికి పంపించాడు. తర్వాత రోజు నుంచి ఇంజక్షన్ ఇచ్చిన ప్రాంతంలో తీవ్రమైన నొప్పి రావడంతో ఈ నెల 26న ఉదయం మళ్లీ ఆర్ఎంపీ వద్దకు వెళ్లాడు. వైద్యుడు మరో ఇంజక్షన్ వేసినా నొప్పి తగ్గలేదు. దీంతో కుటుంబసభ్యులు సతీశ్‌కుమార్‌ను తొలుత గోదావరిఖని, తర్వాత కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఆర్ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్ వికటించడం వల్లే తన కుమారుడు చనిపోయాడని మృతుడి తండ్రి బుజ్జి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆర్ఎంపీపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సమ్మయ్య పేర్కొన్నారు.

పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ కార్యవర్గం



రవీందర్‌ను సత్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లాకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి కంపెనీ రాష్ట్ర నాయకులు ఇంద్రసేనారెడ్డి, సుబ్రమణ్యేశ్వర్ రావు, నరేందర్ తదితరుల సమక్షంలో కొత్తకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విజయ్‌గోపాల్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా బొంకూరి రవీందర్, కోశాధికారిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. పెద్దపల్లి డివిజన్ సెక్రటరీగా మల్క రాజమల్లు, కోశాధికారిగా నారాయణ, మంథని డివిజన్ సెక్రటరీగా శ్రీనివాస్, కోశాధికారిగా శేఖర్, ఎంఆర్‌టీ డివిజన్ సెక్రటరీగా రాజేంద్రప్రసాద్ కోశాధికారిగా సత్యనారాయణను ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని నాయకులు, అధికారులు అభినందించారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



కండువాలు కప్పి, బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేటకు చెందిన యువకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు నాయకులు మెండె అనిల్, దాడి అజయ్, శ్రీకాంత్, సాయి, సంతోష్, సతీష్, మహేందర్ తెలిపారు. నాయకులు పోచాలు, విజయరావు, నీలి శ్రీనివాస్, వెంకటేశ్, అంజయ్య పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌వి ఓటుబ్యాంకు రాజకీయాలు'

కరీంనగర్: బీఆర్ఎస్‌వి ఓటుబ్యాంకు రాజకీ యాలని ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి విమర్శించారు. ఆదివారం కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపించడం వలేల వైశ్య, రెడ్డి కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారన్నారు. వేములవాడ ఎమ్మెల్యేను కేబినెట్ హోదాలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించిన ప్రభుత్వం రెడ్డి, వైశ్య కార్పొరేషన్ల ఏర్పాటు విషయంలో ఎందుకు మీనమేషాలు లెక్కిస్తోందో చెప్పాలని డిమాండ్ చేశారు. వాటిని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు.

'ప్రభావిత' ప్రజల సంక్షేమమే ధ్యేయం

- ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జీఎం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ అన్నారు. ఆదివారం 18వ డివిజన్ అల్లూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. సింగరేణి సూపర్ స్పెషాలిటీ వైద్యుల బృందంతో అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వైద్యులు దాదాపు 324 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అండ్ అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్, టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, డివిజన్ కార్పొరేటర్ బాదె అంజలీదేవి, రాంరెడ్డి, డాక్టర్ కిరణ్‌రాజ్, వకీల్‌పల్లి గని ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌వోటూ జీఎం సలీం, అధికారులు, వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి చలో హైదరాబాద్‌కు తరలిరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలిరావాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ హౌస్ కీపింగ్ సెక్షన్ కాంట్రాక్టు కార్మికులతో కలిసి సంబంధిత వాల్ పోస్టర్ ఆవిష్కరించి, మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా, కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టే మహా ధర్నాకు సింగరేణిలోని అన్ని విభాగాల కార్మికులు హాజరుకావాలని కోరారు. నాయకులు లక్ష్మి, లత, రాజేశ్వరి, లింగయ్య, అనసూర్య, రాజమణి, శ్రీనివాస్, భాగ్య, తేజ తదితరులు పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'లో పౌష్టికాహార దినోత్సవం



విద్యార్థులతో చైర్మన్ నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: విద్యార్థులకు చిన్నప్పటి నుంచే పౌష్టికాహారంపై దృష్టిసారించేలా చూడాలని, వాటిలో ఉన్న పోషక గుణాలను తప్పనిసరిగా తెలియజేయాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి అన్నారు. దీనివల్ల వారు రోగాలబారిన పడకుండా ఉండి, ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుతారని తెలిపారు. కరీంనగర్‌లోని భగత్‌నగర్ అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో ఆదివారం పౌష్టికాహార దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. వారం రోజులపాటు వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో బ్యానర్ల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్

కరీంనగర్ అర్బన్: ఓటరు నమోదు, అభ్యంతరాల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపెయిన్‌ను ఆదివారం పక్కాగా నిర్వహించారు. ఈ నెల 27న సాక్షి దినపత్రికలో 'స్పందన అంతంతే' శీర్షికన కథనం ప్రచురితమైంది. బీఎల్వోలు ఆలస్యంగా కేంద్రాలకు చేరుకోవడం, బ్యానర్లు లేకపోవడం వంటి అంశాలను ప్రస్తావించింది. దీనికి స్పందించిన అధికారులు ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమం పేరిట బ్యానర్లు ఏర్పాటు చేయించారు. ఆదివారం జిల్లా అంతటా అన్ని పోలింగ్ కేంద్రాలకు బీఎల్వోలు నిర్ణీత సమయానికి చేరుకున్నారు. ఓటరు నమోదుకు అధికంగా దరఖాస్తులు రాగా, అభ్యంతరాలకు కొన్ని వచ్చాయని పేర్కొన్నారు.



బ్యానర్ ఏర్పాటు చేయించిన అధికారులు

మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందన



వినయ్‌ని అభినందిస్తున్న ఎమ్మెల్యే రసమయి



సాయికిరణ్‌ను అభినందిస్తున్న రావుల రమేశ్

తిమ్మాపూర్: నీట్‌లో స్టేట్ ర్యాంక్‌లు సాధించిన తిమ్మాపూర్ మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు మెడికల్ సీట్లు పొందారు. నుస్తులాపూర్ చెందిన సాయికిరణ్ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో, మన్నెంపల్లికి చెందిన కామెర వినయ్ మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నుస్తులాపూర్ సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డిలు ఆదివారం వారిని అభినందించి, సత్కరించారు. రాష్ట్రంలో వైద్యానికి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని, కేంద్ర సహకారం లేకపోయినా సీఎం కేసీఆర్ వైద్య కళాశాలలను ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌లు బేతి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కరాటే క్రీడాకారులకు బ్లాక్ బెల్ట్ టెస్టులు



బ్లాక్ బెల్ట్‌లు అందుకున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్: కరాటే షోటోకాన్ కరీంనగర్ ఆర్ ఆర్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఆదివారం స్థానిక ధన్గర్‌వాడీ ఉన్నత పాఠశాలలో బ్లాక్ బెల్ట్ టెస్టులు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి కరాటే ఫెడరేషన్ ఆఫ్ షోటోకాన్ ఇండియా చీఫ్ గణేశ్ బ్లాక్ బెల్ట్‌లను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కరాటేకు విశేష ఆదరణ వస్తోందన్నారు. ఇందులో రాణించినవారు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. ఆర్ఆర్ అకాడమీ చీఫ్ గౌరు రాజిరెడ్డి మాట్లాడుతూ.. అకాడమీకి చెందిన 73 మంది విద్యార్థులు బ్లాక్ బెల్ట్ టెస్టులకు హాజరవగా 17 మంది బ్లాక్ బెల్ట్ సాధించినట్లు తెలిపారు. మిగిలిన 56 మందికి వారి ప్రతిభ ఆధారంగా వివిధ రకాల బెల్ట్‌లను ప్రదానం చేసినట్లు చెప్పారు. సీనియర్ క్రీడాకారిణి గాజుల దీప్తి, చిరంజీవి, డి.మాలతి, ఎం.భవాని, సంజన, మృదుల్ తదితరులున్నారు.

భువన మోహనం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్టీపీసీ విశ్రాంత డిప్యూటీ మేనేజర్(ఫైనాన్స్) నగునూరి రాజన్న రచించిన భువన మోహనం పుస్తకాన్ని భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో సినారె కవితా పురస్కార కమిటీ చైర్మన్, వైద్యుడు ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజహితం కోరుతూ విశ్వమానవ కల్యాణం కోసం కవులు రచనలు చేయాలన్నారు. భువన మోహనంలో విభిన్న అంశాలకు చెందిన గేయాలున్నాయని, మానవతావాదం స్పష్టంగా గోచరిస్తుందని తెలిపారు. పుస్తక స్వీకర్త దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ.. రాజన్న గేయాల్లో ఉత్తమ వ్యక్తిత్వం, సున్నిత మనస్తత్వం, సామాజిక చింతనలు కనిపిస్తాయని అన్నారు. అతిథి గంటా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. కవి అనధికారిక శాసనకర్త, చరిత్రకారుడని, కన్ను మూసేవరకు కలాన్ని నిద్రపోనివ్వొద్దని అన్నారు. అతిథి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దాస్యం లక్ష్మయ్య మాట్లాడుతూ.. గేయాలన్నీ సందేశాత్మకంగా ఉన్నాయని తెలిపారు. అన్నాడి గజేందర్‌రెడ్డి పుస్తక పరిచయం చేశారు. సంస్థ అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు బుర్ర విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ శివారులో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా ఆదివారం పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. గూడెంకు చెందిన అల్వాల స్వామి, ముద్రకోల ప్రశాంత్, సామ్యూల్, వానరాశి మల్లయ్య ఓ వాహనంలో బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ముస్తాబాద్‌లో రేషన్‌బియ్యం దందా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చిన్నారులపై వీధికుక్కల దాడి

వేములవాడ: పట్టణంలోని 17వ వార్డులో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆదివారం ఇంటి ముందు ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులను వీధి కుక్క కరవడంతో ఆందోళనకు గురయ్యారు. వార్డులో కుక్కలు ప్రజల్ని గాయపరుస్తున్నాయని మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుక్క దాడి చేస్తుండగా గమనించిన దుర్గాప్రసాద్, నాగరాజు చిన్నారులను రక్షించారు. పిల్లల తల్లిదండ్రులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.